క్లుప్తంగా

అభినందన



సాయిరాంను కలిసిన వైఎస్ ఎంపీపీ, ఓ.వి.పేట నాయకులు

బూర్జ: ఏపీ ఎన్జీఓ జిల్లా శాఖ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అందజేస్తున్న సేవలు అభినందనీయని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి అన్నారు. శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజీలో సోమవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల సాయిరాంకు సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. సాయిరాం నిబద్ధత, సేవాభావం కలిగిన వ్యక్తి అన్నారు. ఉద్యోగ సంఘాల నాయకుడిగా పలు సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. పలువురు అధికార్లు, ఓ.వి.పేట నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలన్నా.. సత్ప్రవర్తనతో మెలగాలన్నా.. ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని ఎంఈఓ శాంతారావు అన్నారు. మండలంలోని దూకులపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ ససందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇంటి వద్ద విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. స్కూల్‌లో రోజూ ఉపాధ్యాయులు ఏం చెబుతున్నారు, హోం వర్క్ చేస్తున్నారా.. లేదా గమనించాలన్నారు. పాఠశాల నిర్వహణపై కూడా దృష్టి సారించాలని కోరారు. సర్పంచ్ అల్లు అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న చేనేత కార్మికులు

పాతపట్నం: పాతపట్నం మండలంలోని కాగువాడలో ఉన్న చేనేత సంఘాన్ని అక్రమ మార్గంలో ఓ వ్యక్తి నడుపుతున్నారని గ్రామానికి చెందిన చేనేత కార్మికులు ఆరోపించారు. సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ బి.ప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. కేవలం 28 మందికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చేలా చేసి, మిగిలినవారికి అన్యాయం చేశారన్నారు. సంఘంలో జరిగిన విషయాలు తమకు తెలియనివ్వడం లేదన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో అనేం రామారావు, జి.అప్పారావు, కాకర్ల వెంకటరమణ, బొమ్మాన భాస్కరరావు, సైలపు వెంకటరమణ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను ప్రారంభించిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నూతనంగా వేసిన శ్రీకాకుళం-బత్తిలి ఆర్టీసీ బస్సును లాంఛనంగా ప్రారంభించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలోని రహదారి గుంతల మయంగా మారడంపై ఎమ్మెల్యే దృష్టికి ఆర్టీసీ అధికారులను తీసుకెళ్లారు. ఆర్టీసీ ఎండీ, సీఈఓలతో మాట్లాడి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు శర్మ, మల్లికార్జునరాజు, ఆర్టీసీ మేనేజర్ గంగరాజు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులు పూర్తిచేయాలి

ఆమదాలవలస: అన్న క్యాంటీన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మున్సిపల్ ఏఈ అప్పలనాయుడును ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని రైతు బజార్ పక్కన ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఆగస్టు 15 అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి అన్ని హంగులతో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● ఉపయోగపడాలి



ప్రజలందరికీ ఉపయోగపడేలా ఉపాధి పనులు చేయాలని సరుబుజ్జిలి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు లావేటి అనిల్‌కుమార్ తెలిపారు. ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌కు సంబంధించిన గ్రామ సభను రొట్టవలస సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ అధ్యక్షతన సోమవారం ఆర్బీకే వద్ద నిర్వహించారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపుల వివరాలు సోషల్ ఆడిట్ బృందం సభ్యులు చదవి వినిపించారు. ఉపాధి ఏపీఓ పార్వతి, పంచాయతీ కార్యదర్శి రాము పాల్గొన్నారు. - సరుబుజ్జిలి

● శుభ్‌దిన్ భోజన్



ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమం సందడిగా నిర్వహించారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. నరసన్నపేట మండలంలోని సత్యవరం ఉన్నత పాఠశాలలో బెహరా మధుసూదన్ పట్నాయక్ భోజనాలు పెట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలో అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. - నరసన్నపేట

● నేత్ర పరీక్షలు



మెళియాపుట్టిలోని నలంద స్కూల్ డైరెక్టర్ జె.జె.ఎస్.ప్రతాప్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ (శ్రీకాకుళం) సౌజన్యంతో 130 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు మెళియాపుట్టి పీహెచ్‌సీ వైద్యురాలు అలేఖ్య తెలిపారు. 52 మందికి శస్త్రచికిత్సలకు శ్రీకాకుళం తరలించినట్లు ఆప్తాలమిక్ శివప్రసాద్ చెప్పారు. ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు. - మెళియాపుట్టి

● వ్యాక్సినేషన్



సారవకోట మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ చోడసముద్రం గ్రామంలో పశువలకు ముద్ద చర్మ వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాధి రాకుండా మండలంలో టీకాల వేసే కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో కుమ్మరిగుంట వీహెచ్ఏ రవి సాహు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారు. ఈ వ్యాధి రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలోపై అవగాహన కల్పించారు. - సారవకోట

● పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..



హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పాఠ్య, నోట్ పుస్తకాలు చేరినట్లు ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ సోమవారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 81 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 99 మంది చదువుతున్నారన్నారు. వీరికి ఉచితంగా ప్రభుత్వం పాఠ్య, నోటు పుస్తకాలు సరఫరా చేసిందన్నారు. - హిరమండలం

లింక్ రోడ్లు.. కనుమరుగు!



చినషళంత్రి లింక్ రోడ్డు దుస్థితి..

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు..
- వర్షాలు, వరదల సమయాల్లో మరిన్ని అవస్థలు

సరుబుజ్జిలి: గ్రామాల మధ్య రాకపోకలను అనసంధానం చేసే లింక్ రహదారులు సక్రమంగా లేక పోవడం వల్ల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో సుమారు 230 గ్రామాలకు సంబంధించి దాదాపు 67 కిలో మీటర్లు మేర లింక్ రోడ్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో 115 రహదారులు మరమ్మతులు లేక పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. వీటి నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వర్షాలు, వరదల సమయాల్లో అయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి.

లింక్ రోడ్ల వల్ల ప్రయోజనం..

చిన్న, చిన్న గ్రామాల మధ్య సంబంధాలను లింక్ రోడ్లు మెరుగుపరుస్తాయి. కుగ్రామాలకు పోవాలంటే చుట్టూ తిరిగి ప్రయాణించకుండా తక్కువ దూరంలో లింక్ రోడ్ల ద్వారా ప్రయాణాలు చేయవచ్చు. ప్రస్తుతం ఆయా రహదారులు అద్వానంగా ఉన్నాయి. అధికారులు లింక్ రోడ్లపై శ్రద్ధ వహించడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా గ్రామాలకు చేరుకోవాలంటే నరకయాతన పడుతున్నారు.

అద్వానంగా ఉన్న లింక్ రోడ్లు..

సరుబిజ్జిలి మండలంలో ప్రధాన రహదారి నుంచి చిన్న షళంత్రి, బుడ్డివలస, వ్యాసులుపేట, చిన్నపాలెం, కొండవలస తదితర గ్రామాల లింక్ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి, వర్షాల సమయంలో నీరు నిల్వ చేరి బురద గుంటలను తలపిస్తున్నాయి.

నియోజకవర్గంలోని లింక్ రోడ్లు, ప్రస్తుతం శిథిలమైన రోడ్ల వివరాలు ఇలా..

మండలం	లింక్ రోడ్లు	శిథిలమైనవి
సరుబుజ్జిలి	26	16
బూర్జ	30	20
ఆమదాలవలస	45	31
పొందూరు	56	38

మరమ్మతులు చేయాలి



లింక్ రోడ్లు పాడవడంతో గ్రామాల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. వరదలు, వర్షాల సమయంలో రహదారి మొత్తం బురదగుంటలా మారుతుంది. 108, 104 వాహనాలు గ్రామాల్లోకి రావడంలేదు.

– లావేటి విశ్వేశ్వరరావు, కొండవలస

నిధులు మంజూరు చేయాలి



రహదారుల మరమ్మతులు, నిర్మాణాలపై పంచాయతీరాజ్ అధికారులు దృష్టి సారించాలి. రోడ్లు ఎక్కడికక్కడే శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

– ఎస్.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

ప్రతిపాదనలు పంపించాం

అంతర్ రహదారులతోపాటు, లింక్ రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాల కోసం అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– సి.హెచ్.మణికుమార్, పీఆర్ జేఈ, సరుబుజ్జిలి

ఆరాచక పాలనకు చిరునామా ఆంధ్రప్రదేశ్

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రెడ్‌బుక్ పరిపాలన కొనసాగిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ అంటే ఆరాచక పాలనకు చిరునామాగా మార్చేశారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు, లోకేష్ కనుసన్నల్లో అరాచక, ఆటవిక పాలన కొనసాగుతుందన్నారు. రెడ్‌బుక్‌లో పేర్లున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ వ్యతిరేకులపై దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల్లో భయభ్రాంతులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పథకాలు అమలు చేయాలని ప్రజలతో పాటు ప్రతిపక్షం పార్టీ నాయకులు ప్రశ్నించకుండా భయపెట్టి నోరు నొక్కేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి, రైతు భరోసా వంటి అనేక పథకాలు అమలు చేశావారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ నాయకులకు అక్రమంగా, అడ్డదారుల్లో డబ్బులు వచ్చే పనులపైనే చంద్రబాబు దృష్టి సారించారని ఆరోపించారు. అధికారం చేపట్టి 50 రోజులు దాటుతున్నప్పటికీ మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. ఉచిత ఇసుక అని చెప్పిన చంద్రబాబు.. టన్నుకు రూ.340లు వసూలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి, అంగూరుల్లో మాత్రమే ఇసుక విక్రయించటం వెనుకు రహస్యం ఎమిటని నిలదీశారు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదీతీరాల్లోని రేవుల్లో ఇసుక ఉచితంగా తీసుకునే ప్రకటన ఎందుకు చేయటం లేదని ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. వలంటీర్లను కొనసాగిస్తానని, అధికారంలోకి వచ్చిన తరువాత వారికి నెలకు రూ.10వేలు జీతం ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఈ ఊసే ఎత్తడం లేదన్నారు. గడిచిన 50 రోజల పాలన చూస్తే మరోసారి మోసపోయామని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు.

అదనంగా 16 గ్రామాలకు తాగునీరు

- గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ సుదర్శన్



రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డీఈఈ సుదర్శన్

జలుమూరు: శ్రీముఖలింగం రక్షిత మంచినీటి టాంక్ నుంచి స్వచ్ఛమైన తాగునీరు 46 గ్రామాలు అందుతుందని, అదనంగా మరో 16 గ్రామాలకు అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ జల్లు సుదర్శన్ అన్నారు. అచ్చుతాపురం వద్ద ఉన్న శ్రీముఖలింగం సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని సోమవారం పరిశీలించారు. ఇప్పటికే గుర్తించిన సాంకేతిక సమస్యలు, ఇతర లోపాలను సరి చేశామన్నారు. గతంలో రోజుకు ఐదు గంటలు తాగునీరు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు అదనంగా మరో 12 నుంచి 15 గంటలు తాగునీరు ఇచ్చేందుకు అవసరమైన పనులు పూర్తి చేశామన్నారు. విద్యుత్ లోపాలు, పైపులైన్‌లు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఏఈ రఘుపాత్రుని చైతన్య కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

నిఘానేత్రాలు

- ట్రాఫిక్‌తోపాటు వాహనాలపై పర్యవేక్షణ



ఆల్‌ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పాతపట్నం: పట్టణంలో వాహన కదలికలపై, అనుమానితులపై కూడా పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల జాతీయ రహదారి పనుల్లో భాగంగా సీసీ కెమెరాలు, కెబుళ్లు కట్ అవ్వడంతో వాటిని మళ్లీ పునరుద్ధరించినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఆల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో మూడు, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం జంక్షన్‌లో మూడు, పోలీసు స్టేషన్ వద్ద మూడు చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, అంతరాబ కూడలి, సెంటిన్స్ స్కూల్, దువ్వారి వీధి బస్టాండ్ వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల మార్గంతోపాటు ఒడిశా, మెళియాపుట్టి, టెక్కలి, శ్రీకాకుళం మార్గం వైపు కూడా నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమెరాలు పెట్టారు. ఈ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని నేరుగా సర్కిల్ కార్యాలయానికి, జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



చేపేనపేటలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఆమదాలవలస: వరి సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రాజీలేని సూత్రాలను పాటిస్తే పంటల్లో వివిధ దశల్లో వచ్చే తెగుళ్ల నియంత్రణ సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో చేపేనపేట, నిమ్మతొర్లువాడ రైతులతో ప్రధానంగా వరి సాగులో పంటలో తెగుళ్లు, పురుగుల నివారణకు ముందస్తు జాగ్రత్తలపై సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. వరి నారు శుద్ధి చేసుకోవడం, చిగుళ్ల తుంచి నాట్లు వేయడం వల్ల పంట మొదటి దశలో వచ్చే పురుగులను నియంత్రించవచ్చునని అన్నారు. లైన్ షోయింగ్ విధానం వల్ల సూర్య రష్మి పంటకు బాగా తగిలి దుబ్బు శాతం పెరిగి పంట దిగుబడి వస్తుందన్నారు. పొలం గట్లపై కంది, బంతి ఇతర కూరగాయల పంటలు సాగు చేస్తే రైతుకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. సిబ్బంది నక్క చిరంజీవి, తిరుపతి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే గోవిందరావు



శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై కాసేపు చర్చించారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఎల్.ఎన్.పేట: మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ పథకం ఏపీఓ వి.శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక ప్రారంభవుతుందన్నారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలను ప్రజావేదికలో చదివి వినిపిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, ఉపాధి వేతనదారులు, అన్ని వర్గాల ప్రజల హాజరుకావాలని కోరారు.

కాలిబాటలతో ప్రయోజనం



ఏఓ సురేష్‌కుమార్

జలుమూరు: వరి వెదలతోపాటు ప్రస్తుతం చేస్తున్న ఊభాలలో కాలిబాటలు తీసుకుంటే రైతులకు అధిక దిగుబడులతోపాటు బహుళ ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు. కాలి బాటలు తూర్పు, పడమర దిశలలో తీయాలన్నారు. ఒక్కో కాలిబాట 20 సెంటీ మీటర్ల వ్యత్యాసంతో తీసుకుంటే బాగా గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగిలి పైరు ఏపుగా పెరిగి దిగుబడికి దోహద పడుతుందన్నారు. ఎరువులు వినియోగం, కలుపు నివారణ, దోమలు వ్యాప్తి చెందకుండా పైరును కాపాడుతుందన్నారు. రైతులు గమనించి కాలి బాటలు తీసుకోవాలన్నారు. ఊభాలు జరిగిన రెండు, మూడు రోజులు తరువాత కూడా తీసి వాటి వరి మొనలను పక్కనే నాటుకోవచ్చన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

- ఏఐవైఎఫ్ కార్యదర్శులు యుగంధర్, శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ కార్యదర్శులు, విద్యార్థులు

ఆమదాలవలస: మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రైల్వే స్టేషన్ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. నియోజకవర్గంలో జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. అనేక మార్గాలలు, ప్రాంతాల ద్వారా ఆర్టీసీ బస్సుల్లో, ఆటోల్లో గంజాయి, మత్తు పదార్థాల వంటి ప్రమాదకరమైన వ్యాపారం అనేక చోట్ల జరుగుతూ ఉన్నప్పటికీ వీటిపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధికారులు, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిసేధించిన గుట్కా, ఖైని, పాన్ పరాగ్‌ల వ్యాపారం అన్నిచోట్ల యథేచ్ఛగా సాగుతుందన్నారు. వెంటనే అధికారులు వీటిపై జోక్యం చేసుకొని షాపులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తుపదార్థాలు అరికట్టడంలో చేస్తున్న ఏఐవైఎఫ్ పోరాటానికి మేము సైతం ముందుండి అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మాఫియా పట్ల ప్రజలు, విద్యార్థులు, యువకులు చైతన్యవంతులై సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సింహాచలం, కూర్మయ్య, గవర్నమెంట్ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహపంక్తి భోజనాలు



సారవకోట: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓలు



జలుమూరు: సహపంక్తి భోజనాలు చేస్తున్న విద్యార్థులు

జలుమూరు: సహపంక్తి భోజనాలతో విద్యార్థుల్లో ఐక్యత పెరిగి వారిలో సమానత్వం అలవాటుపడుతుందని ఎంఈఓలు బి.మాధవరావు, రవి ప్రసాదరావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా జలుమూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఇప్పిలి వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు నేతవేణి, రాధిక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ రమణ అన్నారు. మండలంలోని అలుదులో ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈఓ-2 భూలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంఈఓ గోవిందరావు అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కుంటిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ధర్మాన కృష్ణవేణి ఆధ్వర్యంలో, పారాపురం ఎంపీయూపీ పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థులు, తల్లిదండ్రులతో సహపక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కుంటిభద్రలో మాజీ సర్పంచ్ అగతమూడి అరుణ్ కుమార్, సర్పంచ్ అగతమూడి రంజిత్, పారాపురంలో సర్పంచ్ రత్నాలు, బసవ రాంబాబు, కోట్ని వసంతరావుతోపాటు పలువురు చందాలు అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో శుభదిన్ భోజన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం వండి పెట్టారు. స్థానిక సర్పంచ్ వి. విజయలక్ష్మి, హెచ్‌ఎం కె.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో శుభదిన్ భోజనాలు హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కోరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎంఈఓ కె.రాంబాబు భోజనం చేశారు. ప్రజాప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొత్తూరు: పారాపురంలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈఓ, విద్యార్థులు



హిరమండలం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ



బూర్జ: భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం